# సింగిల్ పేజీ కథలు

# నైజం

''చూశారా ఎంత బీభత్సం జరిగిందో మొన్న జరిగిన తుపాన్ వల్ల! ఎంతమంది మరణించారో లెక్క తేలలేదు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పాపం చాలా మంది చిన్న చిన్న పిల్లలు ఏకంగా తమ పరివారాన్ని కోల్పోయి అనాథలయ్యారు. వాళ్లను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందిరా'' అన్నాడు గోపాలరావు.

''అవున్రా! నిన్న టీవీలో చూశాను కదా! అక్కడ తుపాన్ బాధితుల అవస్థలు వర్ణనాతీతం. ఇంత వరకూ సరిగ్గా ఎవరికీ ప్రభుత్వ సహాయం అందలేదుట కూడా. అసలు ఆ ప్రాంతాలకు వెళ్లడం కూడా కుదరటం లేదుట'' అన్నాడు శ్యామలరావు.

''ప్రతీ ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల వేలాది మంది కష్టాలు పాలవుతుంటే రాజకీయ నాయకులకి ప్రతీదానిలోనూ రాజకీయమే కనిపిస్తుంది. ఆఖరికి రిలీఫ్ పంచడంలోనూ! ఈ దీనులను పట్టించుకునేదెవరు? ఎటూ వాళ్లందించే రిలీఫ్ ఎలాగూ సరిపోదు. అది కూడా సరిగ్గా అందుతుందో లేదో?'' అన్నాడు రామారావు.

''అవును. వాళ్లకెలాగైనా మనం సహాయం అందజేయాలి'' అన్నాను నేను.

మొన్న దసరాలకి ఒరిస్సాలో అయిన భయంకరమైన తుపాన్ గురించే గత రెండు రోజుల నుంచి మా ఆఫీసులో చర్చంతా. ఆ సూపర్ సైక్లోన్ వల్ల చాలామంది చనిపోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. టీవీలో చూపిస్తున్న భయంకరమైన ఆ తుపాన్ దృశ్యాలు మా ఆఫీసులో అలజడి రేపాయి.

ఆ రోజు సాయంకాలం కేంటీన్‌లో అందరం సమావేశమయ్యాం. మా స్టాఫ్ అందరూ ఆ తుపాన్‌లో నష్టపోయిన వారికి తమ సానుభూతి తెలిపారు. మరణించిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించాం. తుపాను బాధితులకి ప్రభుత్వ సహకారం సరిగ్గా అందడం లేదని, అందువలన మానవతా దృక్పథంతో మేమందరం మా ఆఫీసులో విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని రిలీఫ్ ఫండ్‌కి లేక, నేరుగా బాధితులకు అందజేయడానికి నిర్ణయించుకున్నాం.

అందరి నుంచి విరాళాలు సేకరించడానికి, రామారావు తనపైన బాధ్యత వేసుకున్నాడు.

అందరూ ఏకగ్రీవంగా విరాళాలివ్వడానికి ఒప్పుకున్నారు తుపాన్ బాధితులకి సహాయ పడటానికి.

ఓ మూడు రోజుల తరువాత రామారావు కనబడితే అడిగాను.




''ఏంటి రామారావుగారూ! ఎంతవరకూ వచ్చింది కలెక్షన్! మనం ఎప్పుడు రిలీఫ్ పంపబోతున్నాం?''

''ఇప్పటివరకూ మీరూ, నేను కాకుండా ఇంకో నలుగురు మాత్రం ఇచ్చారు. మిగతా వాళ్ల త్వరలో ఇస్తామన్నారు'' అన్నాడు.

వారం రోజులుగా నేను పనిలో బిజీగా ఉండటంతో కలవలేకపోయాను రామారావుని. ఓ రోజు పనిలో అతని సెక్షన్‌కి వెళ్లగా కనిపించాడు. ఈలోపు మరో ఇద్దరి నుండి మాత్రం విరాళం అందింది అతనికి. చాలామంది నెలాఖరని, జీతా లందిన తర్వాత ఇస్తామన్నారట.

అయితే నెల మొదటివారం అతికష్టం మీద మరో నలుగురి వద్ద నుండి వసూలు చేయగలిగాడు.

ఆ రోజు బాధ పడుతూ నాతో అన్నాడతను.

''చూశారా! ఆ రోజు మీటింగ్‌లో అందరూ తుపాను బాధితుల గురించి ఎంత బాధ పడుతూ మాట్లాడేరో! విరాళాలు కూడా అందరూ ఇస్తామని ఒప్పుకున్నారు. కానీ ఇంతవరకూ పదిమంది వద్ద నుండి మాత్రమే వసూలైంది. ఇలాంటప్పుడు మనం రిలీఫ్ ఎప్పుడు అందించగలం?''

''అవును మరి! అందరూ ప్రభుత్వ యంత్రాంగాన్ని విమర్శించే వాళ్లే గానీ, తమదాకా వచ్చేసరికి ఎవరికీ సహాయం అందించడానికి చేతులు రావడం లేదు. మొదట్లో అందర్లో ఉన్న ఆవేశం ఇప్పుడు చల్లారినట్లుంది. అప్పుడే తుపాను అయి దగ్గర దగ్గర నెలరోజులయింది. మరి ఇలాగైతే మన రిలీఫ్ బాధితులకి ఎప్పుడు అందేను?'' అన్నాను నేను.

''ఇలా మరి లాభం లేదు. నా మీద ఎలాగూ ఈ బాధ్యత పడింది గనుక, రేపు ఓ మీటింగ్ పెట్టి అందరికీ పరిస్థితి వివరిద్దాం. అందరూ ఎంతో కొంత తమకి తోచినంత ఇస్తే త్వరగా పంపిద్దాం. అవసరంలో ఉన్న వారికి సహాయం సమయంలో అందితేనే కదా దానికి ఫలితముంటుంది!'' అన్నాడు.

''అవునండి! అలాగే చేయండి. రేపు మీటింగ్‌కి పిలుద్దాం!'' అతన్ని సమర్థించాను నేను.

అయితే ఆ మరునాడు మీటింగ్‌లో హాజరైన వాళ్లని చూసి ఆశ్చర్యపోయాను నేను. మొదటిసారి మీటింగ్ పెట్టినప్పుడు మా ఆఫీసులో ఉన్న అరవై మంది హాజరైతే, ఈ రోజు పట్టుమని పది మంది కూడా లేరు. వాళ్లందరూ కూడా విరాళాలందించిన వారే కావడం మరో విశేషం. అది చూసి చాలా నిస్పృహకి గురయ్యాడు రామారావు. నాదీ అదే మనస్థితి!

సమయం గడిచే కొద్దీ తుపాను వేగంగా తీరం తాకి ఎట్లా సద్దుమణిగిపోతుందో, సరిగ్గా అలాగే అందరిలోను వేడి తగ్గిపోయింది. మొదట్లో ఆవేశపడిన వాళ్ల పత్తా లేరు!

''ఏం చేద్దాం రామారావుగారూ?'' అప్పుడు అన్నాను నేను.

''ఏం లేదు చేయడానికి. ఇప్పుడు వసూలైన దానికి మనమిద్దరం మరికొంత కలిపి ప్రభుత్వ రిలీఫ్ ఫండ్‌కి పంపిద్దాం. మరీ ఆలస్యమైతే ఎందుకూ పనికి రాదు కదా!'' అన్నాడతను ఓ నిర్ణయానికి వచ్చి.

అలాగేనని ఒప్పుకున్నాను నేను.

**-డి.వి.డి ప్రసాద్**
(పదంపూర్, ఒరిస్సా)